www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 3 ఏప్రిల్ 2025
5
తిరుపతి



విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల వినూత్న నిరసన



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై తిరుపతి ఎస్పీడీసీఎల్ ముందు గత పది రోజులుగా కాంట్రాక్ట్ కార్మికులు రిలే నిరాహార దీక్షలో భాగంగా ఈరోజు నల్లటి బ్యాడ్జీలను కళ్లకు గంతలుగా కట్టుకొని తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించవలసిందిగా న్యాయదేవతను వేడుకోవడం జరిగింది. ఎల్ టెండర్ లో రిలే నిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ కార్మికుల న్యాయమైన సమస్యలను ఇప్పటికైనా అధికారులు చొరవచూపి పరిష్కరించాలని యూనియన్ నాయకుడు కుమార్ తెలియపరిచారు. ఈ సమావేశంలో రవి, మురళి బాబు, సోము, దేవరాజు, ఇమ్మానుయేల్, తేజ, చంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలి : ఫ్యాప్టో రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి



ప్రజాశక్తి - తిరుపతి సిటీ, తిరుపతి టౌన్ : మరణించిన ఉపాధ్యాయ కుటుంబాలకి కారుణ్య నియామకాలు చేపట్టాలని ఫ్యాప్టో రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఎస్.చిరంజీవి డిమాండ్ చేశారు. తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఫ్యాప్టో రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఎస్. చిరంజీవి పాల్గొని మాట్లాడుతూ కరోనా సమయంలో మరణించిన ఉపాధ్యాయుల, ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు ఇవ్వనందున ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఖాళీలు లేవనే పేరుతో కాలయాపన చేయడం సరికాదని, వెంటనే కలెక్టర్ పూల్లో వారికి కారుణ్య నియామకాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు.12వ వేతన సవరణ కాలం ఇప్పటికే 21 నెలలు గడిచిపోయిన కనీసం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేయలేదని వెంటనే కమిషన్‌ను ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానం అమలు చేయాలని లక్షలాది ఉద్యోగుల ఉపాధ్యాయుల ఆకాంక్ష అని, కానీ పాలక వర్గాలు ఆదిశగా ఏమాత్రం అడుగులు వేయడం లేదని అన్నారు. కనీసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో నెం. 57ను అమలు చేయలేదని వెంటనే 2003 డిఎస్సీ వారిని పాతపెన్షన్ విధానం లోనికి తీసుకొని రావాలని డిమాండ్ చేశారు. జిల్లా ఫ్యాప్టో ఛైర్మన్ ఎస్.సురేష్ మాట్లాడుతూ ఉమ్మడి సర్వీసు రూల్స్ అమలు చేయనందున ఉపాధ్యాయులకు డిప్యూటీ డిఈఓ, డైట్ ప్రిన్సిపాల్, డీఈవో పోస్టులు అందని ద్రాక్షలా మిగిలిపోయాయని వెంటనే జీవో నం 73,74 ,75 అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు మీడియంను కనీసం సమాంతర మీడియంగానైనా అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇవ్వవలసిన 3 పెండింగ్ డిఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సెక్రెటరీ జనరల్ వెంకట్రావ్ మాట్లాడుతూ సరెండర్ లీవ్ బకాయిలను, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను, డిఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిహెచ్ రమేష్, ఉపాధ్యాయుని సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, కోశాధికారి కె. శేఖర్, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ లు డి. రామచంద్రయ్య, బి మురళీకృష్ణ ఎ.జగన్నాథం, కార్యదర్శులు రమేష్, వి.బాలసుబ్రమణ్యం, పి.విశ్వనాథ్, కే. మల్లికార్జున, కోశాధికారి లక్ష్మయ్య కార్యవర్గ సభ్యులు, వివిధ సంఘాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీటీడీలో ప్రక్షాళన జరగాల్సిందే : సీఎం



తిరుమల - ప్రజాశక్తి: టీటీడీ భక్తులకు అందించే సేవలు, సౌకర్యాల్లో 100 శాతం మార్పు కనిపించాలని, భక్తుల మనోభావాలకు, ఆలయ పవిత్రతకు పెద్దపీట వేసేలా ప్రతి కార్యక్రమం, నిర్ణయం ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. టీటీడీపై సీఎం చంద్రబాబు సచివాలయంలో సమగ్రంగా సమీక్ష చేశారు. భక్తులకు అందించే సౌకర్యాలు మెరుగుపరిచేందుకు గత 9 నెలల కాలంలో తీసుకున్న చర్యలపై టీటీడీ అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పెరుగుతున్న భక్తుల రద్దీ నేపథ్యంలో భవిష్యత్‌లో చేపట్టే చర్యలపై సీఎం సమీక్షించారు. దర్శనాలు, వసతితో పాటు వివిధ సేవలపై భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలపైనా సమావేశంలో చర్చించారు. బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సమయాలతో పాటు చేపట్టిన చర్యలు, వాటి ఫలితాలపై అధికారులు నివేదించారు. 9 నెలల కాలంలో శ్రీవారి లడ్డూ ప్రసాదం, అన్న ప్రసాదంలో తీసుకువచ్చిన మార్పులపై అధికారులు వివరించారు. గ్యాలరీల్లో సౌకర్యాల పెంపు, మరింత మంది భక్తులకు అవకాశం కల్పించేలా మాఢవీధులలో ఏర్పాట్లు, అలిపిరిలో భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం, శ్రీ పద్మావతీ అమ్మవారి దేవాలయం అభివృద్ధి ప్రణాళిక, అమరావతిలోని శ్రీవారి దేవాలయం అభివృద్ధి పనులు వంటి అంశాలపై సమీక్షలో సుదీర్ఘంగా చర్చించారు. తిరుమల ప్రతిష్ట పెంచడం, తిరుమల క్షేత్రాన్ని భక్తులకు మరింత దగ్గర చేయడం, సులభమైన, సౌకర్యవంతమైన సేవలకు సంబంధించి సీఎం పలు సూచనలు చేశారు.

అవసరమైన పనులే చేయండి

ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ "తిరుమల దేవాలయంలో సేవలు బాగుంటే ప్రభుత్వానికీ మంచి పేరు వస్తుంది. గత ప్రభుత్వానికి నేటికీ ఇప్పటికే మార్పు కనిపించింది. అయితే ఆ మార్పు 100 శాతం ఉండాలి. అప్పుడే భక్తుల, ప్రజల అంచనాలను మనం అందుకోగలం. పెరుగుతున్న రద్దీ నేపథ్యంలో వచ్చే 50 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా టీటీడీని తీర్చిదిద్దాలి. ఏ పనులు అవసరమో ఆ పనులు మాత్రమే చేయాలి. శ్రీవారి డబ్బులు ఇష్టారీతిన ఖర్చు పెట్టవద్దు. మనం దేవాలయానికి ధర్మకర్తలం, నిమిత్తమాత్రులం మాత్రమే. శ్రీవారికి భక్తులు ఇచ్చే కానుకల సొమ్మును ఇష్టారీతిన ఖర్చుపెట్టే అధికారం ఎవరికీ లేదు. ఏడుకొండల వాడి సొమ్ము ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం కాకూడదు. వందల కోట్ల నిధులను అనేక కార్యక్రమాలకు టీటీడీ ఖర్చు చేస్తోంది. దీనిపై ఇంటర్నల్ ఆడిటింగ్‌తో పాటు, కాగ్ ద్వారా ఆడిట్ జరిపితే మంచిది. భక్తులు ఇచ్చే వితరణ, విరాళాలు ప్రతి రూపాయి సక్రమంగా ఖర్చు అవ్వాల్సిన అవసరం ఉంది. జవాబు దారీతనం ఉండాలి" అని సిఎం స్పష్టం చేశారు. "టీటీడీలో సమూల ప్రక్షాళన జరపుతానని నేను ఎన్నికల ముందు చెప్పాను. చెప్పిన విధంగానే అధికారంలోకి వచ్చిన తరువాత అనేక మార్పులు జరిగాయి. అయితే ఈ మార్పులు 100 శాతం ఉండాలి. ఎక్కడా పాతవాసనలు, పాత వ్యక్తులు కొనసాగకూడదు. అనుభవజ్ఞుల పేరుతో పాతవారిని ఇంకా కొనసాగించ వద్దు. ప్రక్షాళన అనేది 100 శాతం జరగాల్సిందే...దీనిలో మినహాయింపులు లేవు" అని సిఎం అధికారులకు సూచించారు.

అలిపిరిలో బేస్ క్యాంప్

సమీక్ష సందర్భంగా టీటీడీ బోర్డు తీసుకున్న పలు నిర్ణయాలను, పలు ప్రతిపాదనలను అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అలిపిరిలో భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. 25 వేల మందికి సౌకర్యవంతంగా ఉండేలా ఈ బేస్ క్యాంప్ నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. అదే విధంగా 60 అనుబంధ దేవాలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్న విషయాన్ని, రాష్ట్రం వెలుపల ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయాల పురోగతిని వివరించారు. శ్రీవారి సేవకుల విషయంలో కొత్తవారు 90 శాతం మంది ఉంటున్నారని అధికారులు చెప్పగా..సగం మంది పాతవారిని నియమించుకోవడం ద్వారా నాణ్యమైన సేవలు అందించవచ్చని తెలిపారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి రోజుకు 25 వేల మంది వరకూ భక్తులు వస్తారని అధికారులు తెలపగా, మరింత అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. బర్డ్ ఆసుపత్రికి డైరెక్టర్ నియామకం, జేఈవో, సివిఎస్‌వో, ఎస్వీబీసీ చైర్మన్ నియామకాలను త్వరలో చేపడతామని సీఎం చెప్పారు. టీటీడీ నుంచి 15 రకాల సేవలు వాట్సాప్‌లో అందిస్తామని అధికారులు చెప్పగా వెంటనే వాట్సాప్ సేవలు ప్రారంభం కావాలని సీఎం సూచించారు. ప్రతి సేవకు ఆధార్, సెల్ ఫోన్ నెంబర్‌ను లింక్ చేయడం ద్వారా ఎక్కడా అక్రమాలు జరగకుండా ఉండటానికి అవకాశం ఉంటుందని చెప్పారు. మరోవైపు పారిశుధ్య నిర్వహణపైనా దృష్టి పెట్టాలన్నారు. తిరుమలలో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు అన్ని అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. టీటీడీ పరిధి మొత్తం 2,675 హెక్టర్లలో విస్తరించి ఉండగా, ఇందులో ప్రస్తుతం 68.14 శాతం పచ్చదనం ఉంది. దీనిని 80 శాతానికి తీసుకువెళ్లాలని స్పష్టం చేశారు.

టీటీడీ సేవలపై సంతృప్తి

రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సందర్భాల్లో తిరుమలలో టీటీడీ అందించిన సేవలపై ఫీడ్‌బ్యాక్ సర్వేలో భక్తుల నుంచి అత్యధిక స్థాయిలో సంతృప్తి వ్యక్తమైందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రథసప్తమి రోజున భక్తుల రద్దీ క్రమబద్దీకరణ, అన్నప్రసాదం, పరిశుభ్రత, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అన్ని అంశాలపై 76 శాతం మంది భక్తులు ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని చెప్పగా, మరో 22 శాతం మంది బావున్నట్టు వెల్లడించారు. కేవలం 1 శాతం పర్వాలేదని, 1 శాతం మంది మాత్రమే బాగోలేదని తెలిపారు. వైకుంఠ ఏకాదశి రోజు 74 శాతం మంది భక్తులు ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని చెప్పగా, మరో 22 శాతం మంది బావున్నట్టు వెల్లడించారు. కేవలం 3 శాతం పర్వాలేదని, 1 శాతం మంది మాత్రమే బాగోలేదని తెలిపారు. మార్చి 9 నుంచి 14 వరకు సాధారణ రోజుల్లో తిరుమల వచ్చిన భక్తుల నుంచి ఐవీఆర్ఎస్ విధానంలో చేసిన సర్వేలోనూ అత్యధిక స్థాయి సంతృప్తి వ్యక్తమైంది. క్యూలైన్ నిర్వహణ, సౌకర్యాలపై 65 శాతం మంది బాగుంది అని చెప్పగా, 28శాతం పర్వాలేదని, 7 శాతం మంది బాగోలేదని సమాధానం ఇచ్చారు. అలాగే వసతి, శుభ్రత బాగుందని 74 శాతం, పర్వాలేదని 19 శాతం, బాగోలేదని 7 శాతం మంది చెప్పారు. లడ్డు రుచి-నాణ్యత బావుందని 77 శాతం, పర్వాలేదని 17 శాతం, బాగోలేదని 6 శాతం మంది చెప్పారు. ఇంకా అన్నదానం, కల్యాణకట్ట, టీటీడీ ఉద్యోగుల ప్రవర్తన, లగేజ్ కలెక్షన్-డెలివరీ వంటి అంశాలపైనా ఇదే స్థాయిలో అభిప్రాయాలు వెల్లడించారు. మొత్తంగా ఐవీఆర్ఎస్ సర్వేలో 61 శాతం మంది భక్తులు టీటీడీ సేవలు బావున్నాయని మెచ్చుకున్నారు. 27 శాతం పర్వాలేదన్నారు. 12 శాతం మంది భక్తులు బాగోలేదన్నారు.

టీటీడీ అనుబంధ ఆలయాల అభివృద్ధి

అమరావతి రాజధానిలోని వెంకటపాలెంలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేయనున్నారు. చుట్టూ ప్రాకారం నిర్మాణంతో పాటు ఒక రాజగోపురం, మూడు గోపురాలు నిర్మించనున్నారు. దీనికి సంబంధించి త్వరలోనే టెండర్లు పిలుస్తారు. అలాగే ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని విస్తరణ పనులతో పాటు సుందరంగా తీర్చిదిద్దనున్నారు. కరీంనగర్, కొడంగల్, నవీ ముంబై, బాంద్రా, ఉలుందుర్పేట, కొయంబత్తూరులో చేపట్టిన శ్రీవారి ఆలయాల నిర్మాణం-అభివృద్ధి కార్యక్రమాలపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. ఈ సమీక్షలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ్ నారాయణ రెడ్డి, టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, చీఫ్ విజిలెన్స్ అధికారి, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లాలో ప్రమాదకర రసాయన ఉత్పత్తుల పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ సంబందిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని మీటింగ్ హాలులో ఫ్యాక్టరీలల్లో అకస్మికంగా జరిగే ప్రమాదాల సంక్షోభ నివారణ చర్యలపై డెప్యుటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వి.రామకృష్ణారెడ్డి, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, పరిశ్రమలశాఖ జిల్లా మేనేజర్ సుధాకర్ రావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ జె.రమణయ్య, శ్రీ కాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్యాక్టరీల్లో ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు స్పందించేలా వుండాలని తెలిపారు. జిల్లా ఆఫ్సైట్ అత్యవసర ప్రణాళికను నిపుణుల సహాయంతో సిద్ధం చేయమని సంబందిత అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు మరియు అత్యంత ప్రమాదకర కర్మాగారముల ప్రతినిధులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

నిర్మాణ వ్యర్థాలు లేకుండా చర్యలు చేపట్టండి



వివిధ ప్రాంతాలను పరిశీలించిన తిరుపతి నగర కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: నగరంలో ఎక్కడా భవన నిర్మాణ వ్యర్థాలు, చెత్త కుప్పలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని గ్రీన్ పార్క్ అపార్ట్మెంట్, డి.ఆర్.మహల్ రోడ్డు, హరేరామ హరే కృష్ణ మార్గం, న్యూ బాలాజి కాలనీలోని ట్రాన్సుర్ స్టేషన్, అన్నా క్యాంటీన్‌ను అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇస్కాన్ వంటశాల వద్ద తడి చెత్తతో గ్యాస్ ఉత్పత్తి చేస్తున్న విధంగా హోటల్స్ వారు చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు మహేష్, రమణ, మధుబాబు, ఏసిపి బాలాజి, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు ఉన్నారు.

వివిధ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష



- **జాతీయ రహదారుల విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి**

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: మల్లవరం - నాయుడు పేట 4, 6 లైన్ల జాతీయ రహదారుల విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఛాంబర్‌లో మల్లవరం నాయుడుపేట జాతీయ రహదారుల రోడ్ల విస్తరణ పనులపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, వర్చువల్ గా నేషనల్ హైవే చెన్నై పిడి రవీంద్ర రావుతో కలిసి సమీక్షిస్తూ.. మల్లవరం నాయుడుపేట జాతీయ రహదారుల 4, 6 లైన్ల విస్తరణ కారణంగా క్రాస్ చేసే చెరువుల వద్ద సప్లై చానల్స్ వద్ద, రోడ్ల విస్తరణ పనులు కు సంబందించి ఇరిగేషన్ శాఖ అధికారులను సంప్రదించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ ఈఈ వెంకటేశ్వర ప్రసాద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

- **కళ్యాణి డ్యాం వద్ద పర్యాటక రంగాభివృద్ధికి ప్రణాళికలు చేయండి**

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి పర్యాటక ప్రాంత, మాస్టర్ ప్లాన్, కళ్యాణి డ్యాం వద్ద పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయుటకు ప్రణాళికలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ తెలి పారు. బుధవారం సాయంత్రం స్థానిక కల్లెక్టరేట్, సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలిసి జిల్లా టూరిజం కౌన్సిల్‌పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయడం కోసం, తిరుపతి టూరిజం మాస్టర్ ప్లాన్ తయారీ కోసం వివిధ శాఖల నుండి సమాచార సేకరణ తర్వాత ప్రణాళిక బద్దంగా మాస్టర్ ప్లాన్ త్వరితగతిన తయారు చేయాలని తెలిపారు. పలు పర్యాటక ప్రదేశాలలో రోడ్లు, త్రాగు నీరు, టాయిలెట్స్, మొదలగు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. కళ్యాణి డ్యాం పర్యాటక అభివృద్ధి కోసం జాయింట్ సర్వే చేసి అటవీ, ఇరిగేషన్, రెవెన్యు, పర్యాటక శాఖ సమన్వయంతో మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని తెలిపారు. చంద్రగిరి కోట నందు లైట్ షో వీలైనంత త్వరగా ప్రారంబించాలన్నారు. పర్యాటక ప్రదేశాలలో విడతల వారీగా ప్లాస్టిక్ నివారణ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ టూరిజం రమణ ప్రసాద్, డిటిసిఓ జనార్ధన్ రెడ్డి, సంబందిత శాఖాధికారులు పాల్గొన్నారు.

నవమికి వరదుడి కష్టాలు

కల్యాణం ఈసారీ రోడ్డు మీదేనా..!



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీరాముడికి నవమి కష్టాలు తప్పేలా లేవు. మరో మూడు రోజుల్లో దేశ వ్యాప్తంగా శ్రీరామనవమి ఉత్స వాలు ప్రారంభం కానున్నాయి. అయితే దేశంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రంగా, యాత్రా స్థలంగా అభివృద్ధి చెందిన శ్రీకాళహస్తిలో సీతా రాముల కల్యాణం జరిపించేందుకు సరైన వేదిక లేదు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంకు అనుబంధంగా పట్టణంలోని నెహ్రూవీధిలో శ్రీరామ మందిరం ఉంది. శ్రీరామ నవమి సందర్భంగా కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. అయితే కల్యాణ వేదిక పెద్ద సమస్యగా మారింది. సమీపంలోనే ఉన్న వరదరాజ స్వామి ఆలయ ఆవరణలో సీతారాముల కళ్యాణం జరిగేది. అయితే గత ప్రభుత్వ పాలకులు చేసిన అనాలోచిత నిర్ణయం కారణంగా ఇప్పటివరకు ఆలయ పునర్ నిర్మాణం పూర్తి కాలేదు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రసన్న వరదరాజుల స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. అయితే కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల నిర్మాణ పనుల్లో నాలుగేళ్లుగా అతిగతి లేకుండా పోయింది. ఫలితంగా ఆలయ ఆవరణ వ్యర్థాలతో నిండి పోయింది. దీంతో నెహ్రూ వీధిలోనే (నడి రోడ్డుపై) వేదిక ఏర్పాటు చేసి కళ్యాణం జరిపిస్తున్నారు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఏర్పడనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలైనా ఇప్పటివరకు ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. అయితే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా పెళ్లి మండపం వద్ద ఆది దంపతుల కళ్యాణం జరుగుతుంది. ఈ సారికి ఆ వేదికలోనైనా సీతారాముల కల్యాణం జరపాలని స్థానికులు కోరుతున్నారు.

మాట నిలుపుకున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

భవిత కేంద్ర విద్యార్థికి సొంత నిధులతో బ్యాటరీ మోటార్ సైకిల్ అందజేత



కలెక్టర్ ఛాంబర్‌లో విభిన్న ప్రతిభావంతుడు రమేష్‌కు బ్యాటరీ మోటార్ సైకిల్ అందజేస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): విభిన్న ప్రతిభావంతుడిగా ఉండి జాతీయస్థాయిలో బెంగళూరు కేంద్రంగా జరిగిన క్విజ్ పోటీలలో మొదటి బహుమతి సాధించి జిల్లాకు ఆదర్శంగా నిలిచిన వడ్లమూడి రమేష్‌కు గతంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందిస్తూ బ్యాటరీ మోటార్ సైకిల్ అందిస్తానని మాట ఇచ్చారు. బుధవారం ఈ మేరకు సదరు విభిన్న ప్రతిభావంతుడు వడ్లమూడి రమేష్ కు రూ.50వేల రూపాయల విలువగల బ్యాటరీ మోటార్ సైకిల్ ను అందించారు. నాలుగో తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు తిరుపతి అర్బన్ మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల భవిత కేంద్ర విద్యార్థి రమేష్ సమగ్ర శిక్ష తిరుపతి వారి సహకారంతో చదువుతూ క్విజ్ పోటీలలో రాణిస్తున్నాడు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ పాల్గొన్నారు.

వేధింపులు మానుకోవాలి : ఎస్ఎఫ్ఐ





ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో వర్క్ లోడ్ పేరుతో విభాగాల విలీనం చేస్తున్నామని ప్రస్తుతం పని చేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్లపై తీర ఒత్తిడి తీసుకురావడం, వేధింపులకు గురి చేయడం మానుకోవాలని ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, రవి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021 నుంచి 2024 వరకు యస్వీయు ఎమ్.ఏ, ఎమ్.ఎస్సి కోర్సులలో ప్రవేశాలు దారుణం పడిపోయాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష నోటిఫికేషన్ సకాలంలో విడుదల చేయకపోవడం, రాష్ట్రంలోని 14 విశ్వ విద్యాలయాల పరిధిలోని డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు పూర్తి కాకపోవడం, ఫలితాలు విడుదల చేయకపోవడం వంటి సమస్యలతో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. మంత్రి నారా లోకేష్ పీజీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించకుండా, ఆయా సంబంధిత వర్సిటీలకే అప్పజెప్పితామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీని అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. కాగా నేడు వర్సిటీలో వర్క్ లోడ్ పేరుతో చాలా విభాగాలను విలీనం దిశగా ప్రణాళికలు వేయడం దారుణమన్నారు. దీంతో చాలా మంది సిబ్బంది ఉద్యోగాలు కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ ఒత్తిడిలతో విలీన ప్రక్రియ, ఉద్యోగుల తొలగింపు చర్యలు చేపడితే భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

మంగళం పంచాయతీలో 'కుర్చీలాట'

తమవారికి స్థానం కల్పించేందుకు నేతల ప్రయత్నాలు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఉమ్మడి శెట్టిపల్లి పంచాయితీ నుండి ఐదు పంచాయతీలుగా ఏర్పడిన మంగళం ప్రాంతంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీ సిబ్బందిపై రాజకీయ ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయని స్థానికంగా ఉన్న విమర్శ. కూటమి నేతలు తమవారికి పంచాయతీలో చోటు కల్పించేందుకు ఉన్న సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలు ఇటీవల ఎక్కువయ్యాయి. వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే మంగళం పంచాయతీలో కార్యదర్శి తర్వాత కీలకమైన బిల్ కలెక్టర్ పోస్ట్‌కు ఇప్పటికే ఉన్న వ్యక్తి స్థానంలో మరొకరిని నియమించేందుకు నేతలు ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది. అయితే ఇటీవల మంగళం పంచాయతీలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న వ్యక్తిని తప్పిస్తూ తనకు ప్రాధాన్యత కల్పించాలని బిల్ కలెక్టర్ పోస్టులో కూర్చోవడానికి కుర్చీలాట మొదలెట్టారు. గత నాలుగు రోజులకు మునుపు బిల్ కలెక్టర్ కుర్చీలో ఇప్పటికే పనిచేస్తున్న వ్యక్తి కాకుండా నూతనంగా ఆ స్థానం కోసం ప్రాకులాడుతున్న వ్యక్తి మధ్యాహ్నం వరకు ఉండడం, అటు తర్వాత బిల్ కలెక్టర్‌గా కొనసాగుతున్న వ్యక్తి జిల్లా అధికారులను కలిసి మధ్యాహ్నానికి తన సీటులో కూర్చున్నారు. మంగళం పంచాయతీలో ఈ బిల్ కలెక్టర్ పోస్ట్‌కు జరుగుతున్న కుర్చీలాట నియోజకవర్గ ఎమ్మెల్యేకు తెలిసింది. దీనిపై ఎమ్మెల్యే పార్టీ నేతలతో కూడా సమాలోచన చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.

సాధారణంగా పంచాయతీలో పనిచేస్తున్న ఏదేని సిబ్బందిని మార్చాలంటే పంచాయితీ వార్డు సభ్యుల సమావేశాన్ని నిర్వహించాల్సి ఉంది. వార్డు సభ్యుల సమావేశంలో అజెండాలో పంచాయతీలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై, పంచాయతీకి ఇబ్బందికర సిబ్బందిని మార్చాలనుకుంటే వార్డు సభ్యులందరూ తీర్మానం చేసి సంతకాలు చేయాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం జరుగుతున్న బిల్ కలెక్టర్ కుర్చీలాటలో... ఉన్న వ్యక్తిని తొలగించడానికి, కొత్త వ్యక్తిని నియమించడానికి ఎటువంటి వార్డు సభ్యుల తీర్మానము లేదని తెలుస్తోంది. అయినా ఆ బిల్ కలెక్టర్ కుర్చీ కావాలని ఓ వ్యక్తి చేస్తున్న ప్రయత్నాలు రాజకీయంగా, స్థానికంగా చర్చించుకుంటున్నారు. ఎన్నడూ లేని విధంగా పంచాయతీ సిబ్బందిపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకువచ్చి తొలగింపు కార్యక్రమాలు చేయడం పట్ల కొంతమంది పెదవి విరుస్తున్నారు. గతంలో అదనపు బిల్ కలెక్టర్లు ఎందుకని ప్రశ్నించిన వారే నేడు అధికారం చేపట్టాక అదనపు బిల్ కలెక్టర్లను నియమించుకున్నారని విమర్శలు ఉన్నాయి.

అయితే ఇప్పుడు బిల్ కలెక్టర్‌గా కొనసాగుతున్న వ్యక్తిని తప్పించి ఆ స్థానాన్ని దక్కించుకోవాలని చూస్తున్న వ్యక్తిని తొలగించాలని గతంలోనే వార్డు సభ్యుల సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ పంచాయతీలో కొనసాగుతున్న ఆ వ్యక్తి బిల్ కలెక్టర్ స్థానం కోసం కుర్చీలాట ఆడుతుండడం పట్ల వార్డు సభ్యులు అయోమయ స్థితిలో ఉన్నారు. ఈ పరిస్థితిపై నియోజకవర్గ ఎమ్మెల్యే ఇటువంటి నిర్ణయం తీసుకుంటారో వేచిచూడాలి.

కొత్త బిల్ కలెక్టర్ నియామక తీర్మానం చెయ్యలేదు


పంచాయతీ పాలకవర్గం నుండి కొత్త బిల్ కలెక్టర్‌ను నియమించుకోవాలని మేము ఎటువంటి తీర్మానం చెయ్యలేదు. కానీ కొత్తగా బిల్ కలెక్టర్ కావాలని ప్రయత్నిస్తున్న వ్యక్తి ప్రస్తుతం బిల్ కలెక్టర్‌గా కొనసాగుతున్న వ్యక్తి స్థానంలో రావడానికి కొంత మంది వార్డు సభ్యుల సంతకాలు తీసుకున్నట్లు చెబుతున్నారు. అధికారికంగా వార్డు సభ్యుల సమావేశం నిర్వహిస్తే అందులో మెజారిటీ వార్డు సభ్యులు నిర్ణయాన్ని తీర్మానం చేస్తే తప్ప సిబ్బంది మార్పు చేయలేం.

- లావణ్య, కార్యదర్శి, మంగళం పంచాయతీ.

ఇసుక దోపిడీకి అంతెప్పుడు..?

ప్రజాశక్తి - నాయుడుపేట: నీటికి నిలయమైనా నాయుడుపేటలో నీరు కనుమరుగైపోతుందా అనే ప్రశ్నకు నిజమే అని సమాధానం ఇస్తున్నారు విశ్లేషకులు. నాయుడుపేటలోని ప్రజలు నీటి ఎద్దడికి గురి కాబోతున్నారని పట్టణంలోని ప్రతి ఒక్కరూ ఆందోళన చెందుతున్నారు. ఇందుకు బలమైన కారణం లేకపోలేదు. వందల సంవత్సరాలుగా నాయుడుపేటలోని స్వర్ణముఖి నది ఒక్క నాయుడుపేటకే కాక చుట్టుపక్కల పల్లెలకు నీరు అందిస్తూ పల్లెలోని ప్రజలకు వ్యవసాయ పరంగా తోడ్పడుతూ ప్రజలందరికీ నాయుడుపేట మండలానికి చుట్టుపక్కల రైతుల పాలిట వరాలు ఇచ్చే అమ్మగా నిలిచింది. అంతటి అమోఘమైన కీర్తి ప్రతిష్టలు గల స్వర్ణముఖి నదిలో అతి త్వరలో నీరు అనేది కనిపించని, జీవంలేని ఎడారిలా దర్శనమివ్వబోతున్నది అంటే నమ్మగలమా! కానీ తప్పదు నమ్మాలి, ఎందుకంటే అలాంటి పరిస్థితులను ఎదుర్కొనవలసిన దుస్థితి నాయుడుపేట ప్రజలకు ఏర్పడబోతుంది.

- స్వర్ణముఖి నదిలో ఇష్టానుసారంగా ఇసుక దోపిడీ
- అక్రమంగా పక్క రాష్ట్రాలకు తరలిపోతున్న వైనం
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- నదిలో అడుగంటి పోతున్న జల వనరులు
- నాయుడుపేట ప్రజలకు త్వరలో తలెత్తబోతున్న నీటి ఎద్దడి



అసలు ఈ సోదంతా ఎందుకు ఇంతకు విషయం ఏంటీ అని చిరాకు పడుతున్నారా.., ఇదేం కొత్త విషయం కాదు అందరికీ తెలిసిందే. ప్రతిరోజు ప్రతి ఒక్కరూ కళ్లప్పగించి చూస్తు మనకెందుకులే మన విషయం కాదు కదా అని అతి తేలిగ్గా తీసుకుంటున్న విషయమే మనుషుల మనుగడకు అతి ప్రమాదకరమైన ఇసుక దోపిడీ గురించి. నాయుడుపేటకు చుట్టుపక్కల మున్సిపాలిటీలు, నియోజకవర్గాలైన శ్రీకాళహస్తిలో ఉన్నట్టుగా అతి పురాతనమైన నిత్యం లక్షలమంది దర్శించుకునే మహాదేవుని ఆలయం, వెంకటగిరి అంటే గుర్తొచ్చేది రాజా వారి కోట, చుట్టుపక్కల రాష్ట్రాలకు ప్రజలు కూడా మొక్కులు తీర్చుకునే పోలేరమ్మ ఆలయం, గూడూరు విషయానికొస్తే రైల్వే జంక్షన్ దేశ విదేశాలకు ఎగుమతి అయ్యే నిమ్మకాయల యార్డ్, ఇక సూళ్లూరుపేట తీసుకుంటే ప్రపంచంలోని పేరుగాంచిన రాకెట్ ప్రయోగ కేంద్రమైన షార్, అంతకుమించి పక్క రాష్ట్రాల ప్రజలకు ఆరాధ్యదైవమైన చెంగాళమ్మ ఆలయం ఇలా వీటికి ఉన్నట్టుగా ప్రత్యేకతలేమి లేకపోయినప్పటికీ ఎక్కడెక్కడి వారో ఇక్కడికి వచ్చి స్థిరపడుతున్నారంటే అందుకు కారణం నాయుడుపేట స్వర్ణముఖి నది అని గర్వంగా చెప్పవచ్చు. నాయుడుపేట పేరు చెప్తే ఆ పట్టణాల్లో నివసించే వారందరికీ గుర్తొచ్చేది ఎప్పుడు పుష్కలంగా ఉంటూ ఎంతో రుచికరంగా ఉండే నీరందించే స్వర్ణముఖి నది. ఆ చరిత్ర ఇప్పుడు మాయం అయిపోతోంది. ఇసుకను ఇష్టానుసారం దోచు కుంటూ పక్క రాష్ట్రా లకు తరలించి, సొమ్ము చేసుకుంటున్న వారి పుణ్యమా అని స్వర్ణ ముఖినది ఇప్పటికే రాళ్ల దిబ్బలా దర్శనమి స్తుంది.15, 20 ఏళ్ల ముందు వరకు నాయు డుపేటలోని స్వర్ణముఖి నది నిండుగా ఇసుకతో బంగారు వర్ణంలో మెరిసిపోతూ, చేతులతో ఎక్కడ లోడిన నీళ్లు కనిపిస్తూ చుట్టుపక్కల పొలాలు ఉన్న వ్యవసాయదారుల కష్టాలను తీర్చే జీవనదిలా చెప్పుకునేవారు చుట్టుపక్కల ప్రజలంతా, కానీ ఇప్పుడు పరిస్థితులు దానికి విరుద్ధంగా తయారయ్యాయి, అందుకు కారణం స్వర్ణముఖి నదిలో విచ్చలవిడిగా జరుగుతున్న ఇసుక దోపిడి. అధికార బలంతో ప్రతి ఒక్కరూ ఇష్టానుసారంగా ఇసుకను పక్క రాష్ట్రాలకు తరలిస్తూ ఉండడమే. నదిలో ఎంత ఇసుక ఉంటే ఏ స్థాయిలో నీరు నిలబెట్టుకోగలమో తెలిసిన అధికారులు సైతం ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న వారిని అడ్డుకొనకపోగా అసలు సమస్య కాదన్నట్టు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం ఏలాఅభివర్ణించాలో అర్థం కాని ప్రశ్నగా మిగిలిపోయింది. నదిలోని ఇసుకను ఇష్టానుసారంగా ఎత్తేస్తే లక్షల మంది ప్రజలు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కొనవలసి వస్తుందో తెలిసి కూడా మేము మా కుటుంబాలు దర్జాగా బ్రతికితే చాలు అనుకునే బడా బాబులకు వంత పాడుతూ అధికారులు జేబులు నింపుకుంటున్నారు. గత ప్రభుత్వం కట్టడి వల్ల ఐదేళ్లపాటు స్థానిక పేద ప్రజలు ఇంటి నిర్మాణాలకు ఇసుక లేక వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇసుక రీచ్‌ల నుంచి అంత మొత్తం చెల్లించి ఇసుక కొనలేక ఇబ్బంది పడుతున్న వారిని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం స్థానిక పేదల కోసం తీసుకున్న నిర్ణయాన్ని కొంతమంది అధికార బలమున్న బడాబాబులు అవకాశంగా మలుచుకుని ఇసుకను ఇష్టానుసారం తరలించేస్తూ కూటమి ప్రభుత్వానికి మాయని మచ్చని తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. నాయకులు కూడా ఈ విషయంలో నోరు మెదపడం లేదు. డీఎస్పీ కేంద్రమైన నాయుడుపేటలో ఇంత దోపిడీ జరుగుతున్న పోలీసులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ఇలాంటి వాటిని నియంత్ర ణకు ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడ్డ స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో (సెబ్) సర్కిల్ స్టేషన్ కూడా ఉంది. అయినప్పటికీ వీటిని నియంత్రించడంలో పూర్తిగా విఫలమయ్యారని చెప్పొచ్చు. వీటిపై వారిని వివరణ కోరితే.. చూస్తున్నాం.. చేస్తున్నామంటూ దాటేసే ప్రయత్నాలు చేస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక తరలిస్తూ ఉంటే అప్పుడప్పుడు ఏదో ఒక బండి పట్టుకొని అది కూడా సాయంత్రానికల్లా వదిలేస్తూ ప్రజల చూపు మరల్చే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం నాయకులు లక్షల ఖర్చు పెట్టి స్వర్ణముఖి నదిలో మూడు రోజులపాటు అనేక కార్యక్రమాలు చేపట్టి ఏటి పండుగ నిర్వహిస్తుంటారు. ప్రజలు కూడా ఆనందోత్సాహాలతో ఏటి పండుగలో పాల్గొంటారు. మూడు రోజులు పాటు స్వర్ణముఖి నదిలో కోలాహలంగా గడిపి తర్వాత ఎవరి పనుల్లో వారు నిమగ్నమైపోతారు. ఈ మూడు రోజులపాటు ఏట్లో గడుపుతున్నప్పుడు కూడా అటు నాయకులకు గాని ఇటు ప్రజలకు గాని ఎవ్వరికి కూడా స్వర్ణముఖి నది ఇలా అయిపోతుంది ఇలాగే జరుగుతుంటే తర్వాత జనరేషన్ పరిస్థితి ఏమిటి అన్న ఆలోచన రాకపోవడం విచారించదగ్గ విషయం.ఈ దోపిడీని కట్టడి చేయలేకపోతే ఇక్కడ నీరు ఉండేదని కాదు ఏరుండేదంట అని చెప్పుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నది ప్రజల ఆందోళన. ఇకనైనా నాయకులు దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

క్రైం న్యూస్

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్ట్



ప్రజాశక్తి-తిరుపతి (మంగళం) పుత్తూరు టౌన్: తిరుపతి జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వర రెడ్డి ఆదేశాలతో వడమాల పేట, గుంటకట్ట వీధిలో వల్లెమ్మ, ఢిల్లీ ప్రసాద్ అనే వ్యక్తుల నుండి రూ.9600 రూపాయల విలువ గల 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ఎన్ డిపిఎస్ చట్టం ప్రకారం వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ పోలీసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పుత్తూరు ఎక్సైజ్ సిఐ, ఈఎస్ టాస్క్ ఫోర్స్ సంయుక్తంగా ఈ దాడులలో పాల్గొన్నారు. అయితే 2016-17లో వల్లెమ్మపై గంజాయి రవాణా కేసు నమోదు అయిందని, ఈ కేసులో ఆమె పదివేల జరిమానాలతో పాటు జైలు శిక్షణను అనుభవించారన్నారు. ఈ దాడులలో ఎక్సైజ్ మురళీమోహన్, ఎస్సైలు శివప్రసాద్, స్వామినాథన్, హెడ్ కానిస్టేబుళ్లు రవి, చంద్రశేఖర్, కానిస్టేబుళ్ళు మునిరెడ్డి, డేవిడ్, చిరంజీవి, మెహతాజ్, హారతి పాల్గొన్నారు.

గంజాయి విక్రేతలు అరెస్టు.. 5 కెజీలు స్వాధీనం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, గాంధీనగర్ సమీపంలో గంజాయి విక్రయదారులను అరెస్టు చేసిన సంఘటన చోటుచేసుకుంది. బుధవారం గూడూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం పోలీసులు వివరాలు వెల్లడించారు. రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ గూడూరు రెండో పట్టణ పరిధిలోని గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన సునీల్ , అవినాష్‌లు కలిసి గంజాయిని విక్రయిస్తున్నారన్నారు. 5 కె.జీల గంజాయిని తీసుకొని సునీల్ అనే వ్యక్తి గాంధీనగర్‌లోని సమాధుల తోట వద్ద విక్రయించేందుకు ఉండగా, రాబడిన సమాచారం మేరకు అతన్ని పట్టుకుని అరెస్టు చేశామన్నారు. గంజాయితో పాటు, అతని వద్ద ఉన్న స్కూటీని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెండో పట్టణ ఎస్. ఐ సుబ్రమణ్యం రాజు , సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా

ప్రజాశక్తి - రేణిగుంట: బుధవారం రేణిగుంట పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ సెక్షన్ కింద ఒక వ్యక్తికి 10,000 జరిమానా, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగేవారికి 14 మందికి ఒక్కొక్కరికి రూ. 2000 చొప్పున మొత్తం 28,000/- జరిమానా, న్యూసెన్స్ కేసులో ఐదు మందికి ఒక్కొక్కరికి 1000 రూపాయలు మొత్తం 5000 రూపాయలు జరిమానా తిరుపతి మెజిస్ట్రేట్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

పిల్లలను అంగన్వాడికి పంపించండి

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు మండలం, యండి పుత్తూరులో మంగళవారం సమగ్ర పిల్లల అభివృద్ధి సేవాసంస్థ పర్యవేక్షకులు గ్రామాన్ని సందర్శించారు. జీవీఎల సర్పంచ్ మోహనప్రియ మిట్టఇండ్లు గిరిజన కాలనీలో సందర్శించినపుడు అక్కడి ప్రజలు దాదాపు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న గ్రామంలోని అంగన్వాడికి పిల్లలను పంపటానికి ఇబ్బందిగా ఉందని, మిట్టఇండ్లలో మినీ అంగన్వాడి ఏర్పాటు చేయాలని కోరారు. ఈ విషయాన్ని సర్పంచ్ మండలంలో జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో అధికారులకు తెలియపరిచారు. అంగన్వాడి పరిశీలకులైన ఐసిడిఎస్ పర్యవేక్షకులు శ్రీదేవి, సర్పంచ్ మోహనప్రియలు గ్రామంలో పరిశీలన చేసి, పిల్లల తల్లిదండ్రులతో సమావేశమై ప్రస్తుతానికి పిల్లలను గ్రామంలోని అంగన్వాడికి పంపించమని, ఈ విషయాన్ని పై అధికారులకు తెలియపరుస్తామని చెప్పారు.

జీవనోపాధి అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి -కోట : ప్రభుత్వం అందించే రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల జీవనోపాధి అభివృద్ధి చెందడమే లక్ష్యమని వెలుగు ఏపిఎం అనిల పేర్కొన్నారు. బుధవారం కోట మండలంలోని స్థానిక వెలుగు కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో మండలంలోని స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి)సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి 10 గ్రామ సంఘాల ఎన్యూమరేటర్స్, వివోఏలు, వెలుగు సీసీలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వెలుగు సీసీలు భాస్కర్,శంకరయ్య,ప్రసాద్, అరివేష్మ్మవి ఓ ఏస్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు.

ఆధార్ క్యాంప్ సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: సచివాలయంలో నిర్వహించే ఆధార్ క్యాంప్‌ను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సచివాలయం ద్వారా ఈరోజు, రేపు ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నారని అందులో చిన్నారులకు ఆధార్ నమోదు చేసుకోవాలని తెలిపారు.

గుట్టుగా బట్టీలకు మట్టి తరలింపు



ప్రజాశక్తి - కోట: కోట మండలం, తిమ్మనాయుడుపాలెం వద్ద ఓ ఇటుక బట్టీల యజమాని అధికారుల అనుమతి లేకనే కర్లపూడి నుండి తిమ్మనాయుడుపాలెం ఇటుక బట్టీల వద్దకు భారీగా ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. గత రెండు రోజులుగా ఈ మట్టి తరలింపు కార్యక్రమం జరుగుతోంది. అధికారులు స్పందించి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను అదుపుకు ఒక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆటిజం అవగాహన దినోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: మండలంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి బి.తిరుమల రాజు, బాల సుబ్రహ్మణ్యం, పుత్తూరు ప్రధాన పాఠశాల హెచ్ఎం మురళీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ 2 బాల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆటిజం ఉన్న పిల్లలతో తల్లిదండ్రులు చాలా ఓర్పుతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆనంద, సూర్యకుమారి స్పెషల్ టీచర్ జగదీశ్వర్ విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి : ఎమ్మెల్యే పాశం

ప్రజాశక్తి - చిల్లకూరు: చిల్లకూరు మండలం, ఉడతావారి పాళ్లపల్లి, తోణుకుమాల గ్రామాల్లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ప్రారంభించారు. దాదాపు రూ. 30 లక్షలతో ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.

నేడు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే నాని

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: మండలంలో నేడు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో, కొన్ని ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొననున్నారని మండల తెలుగుదేశం పార్టీ ఇన్చార్జులు కొట్టె శివకుమార్, బెల్లంకొండ మురళీలు విలేకరులకు తెలిపారు. ఉదయం రంగన్నగారిగడ్డలో పశువుల నీటి తొట్టి ప్రారంభానికి భూమి పూజ, తొగటపల్లిలో వాటర్ ప్లాంట్ ప్రారంభం, బొట్లైనివారిపల్లిలో సి.సి రోడ్డు ప్రారంభం, చిన్నగొట్టిగల్లు జడ్పీ హైస్కూల్‌లో సంద్రా రెడ్డప్ప పదవీ విరమణ కార్యక్రమంలోను, మధ్యాహ్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో వ్యవసాయ పనిముట్లు రైతులకు పంపిణీ, భాకరాపేట అటవీ శాఖ కార్యాలయంలో ఏనుగుల దాడిలో పంట నష్టం వాటిల్లిన రైతులకు నష్ట పరిహార చెక్కులు అందజేస్తారన్నారు.

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ వెలుగు కార్యాలయంలో 2025-2026 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలు వార్షిక ఋణ, జీవనోపాధుల ప్రణాళిక తయారు చేయడంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో సీసీలు వెంకటరత్నం, వీరజన్మ, అకౌంటెంట్ హేమగిరిజ, మండల సమాఖ్య లీడర్లు, గ్రామ సంఘం అసిస్టెంట్లు, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉజ్వల భవిష్యత్తు



ప్రజాశక్తి - క్యాంపస్ : పాలిటెక్నిక్ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని విశ్వం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వరదరాజనగర్‌లోని విశ్వం టాలెంట్ స్కూల్లో బుధవారం నిర్వహించిన పాలిటెక్నిక్, ఏ.పి.ఆర్.జె.సి. నమూనా ప్రవేశ పరీక్ష అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో మంచి స్టడీ మెటీరియల్ అందించి, ఉత్తమ ఫలితాలను సాధించడానికి విశ్వం విద్య సంస్థ కృషి చేస్తుందని వెల్లడించారు. గత 35 సంవత్సరాలుగా సైనిక్ , నవోదయ, పాలిటెక్నిక్, ఏ.పి.ఆర్.జె.సి. వంటి పోటీ పరీక్షలలో జాతీయ, రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులను సాధిస్తున్నట్లు చెప్పారు. ప్రవేశ పరీక్ష దరఖాస్తులకు సంబంధించి మరిన్ని వివరాలకు 8688888802, 9399976999 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

ఆటిజం అవగాహన దినోత్సవం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల భవిత కేంద్రంలో బుధవారం ఫిజియోథెరపీ వైద్యులు డాక్టర్ సి.విజయ్ కుమార్ పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి మునిసుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. పిల్లలకు వ్యాక్సిన్లు, యాంటి బయోటిక్ మందులు వాడటం వలన వారి మెంటల్, ఫిజికల్ హెల్త్ సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్, సహిత ఉపాధ్యాయులు అయ్యప్ప రెడ్డి, నయోమిలు పాల్గొన్నారు.

కాలువ స్థలం ఆక్రమించి.. రోడ్డు మార్గం ఏర్పాటు

చోద్యం చూస్తున్న రెవెన్యూ యంత్రాంగం



కాలువను పూడ్చడానికి మట్టి తోలిన దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): అది నగరపాలక సంస్థ పరిధిలోని మాస్టర్ ప్లాన్ రోడ్డు మార్గం. ఇటీవల అక్కడ అనధికారికంగా ఉంటున్నారని కొన్నేళ్లుగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు అధికారులు కూల్చివేశారు. అయితే సదరు స్థలానికి పక్కనే ఓ ప్రైవేటు వెంచర్‌కు రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేసుకోవడానికి మురుగు కాలువ స్థలాన్ని ఆక్రమణ చేసి రోడ్డు ఏర్పాటుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. తిరుపతి అర్బన్ మండలం 162 సర్వే నెంబరులో గల సదరు కాలువ యదేచ్ఛగా ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ యంత్రాంగం, నగరపాలక అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పట్ల పలు విమర్శలు వస్తున్నాయి. పేదల గుడిసెలు కూల్చివేసిన అధికారులకు ఈ ఆక్రమణలు పట్టవా అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి సదరు కాలువ స్థలం ఆక్రమణను అడుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సంయుక్త సర్వే నిర్వహిస్తాం... సర్వే నెంబర్ 162లో మురుగ కాలువకు ఇరిగేషన్, రెవిన్యూ, నగరపాలక అధికారులచే సంయుక్త సర్వేను నిర్వహించి కాలువ భూమి, మిగులు రెవిన్యూ భూమిని లెక్కిస్తాం. - భాగ్యలక్ష్మి, తాహాశిల్దార్, తిరుపతి అర్బన్ మండలం

విద్యార్థుల అవసరానికి నూతన అంబులెన్స్‌ను వినియోగించండి

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయుకి ఇటీవల యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ప్రత్యేకంగా నూతన అంబులెన్స్‌ను విరాళంగా అందించారు. అయితే గడచిన 4 నెలలోల ఈ నూతన అంబులెన్స్‌ను విద్యార్థుల అవసరాల కోసం వినియోగించకపోవడం శోచనీయమని గిరిజన నవ సమాజ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు శివ శంకర్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. అంబులెన్స్ వినియోగానికి బుధవారం ఆయన వర్సిటీ ఇన్చార్జి విసి ఆచార్య సిహెచ్ అప్పారావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలం చెల్లిన వాహనాన్ని అత్యవసర పరిస్థితుల్లో వినియోగిస్తున్నారు కానీ, నూతన వాహనాన్ని గారేజీలోనే ఉంచడం భావ్యం కాదన్నారు. గత వారంలో యూనివర్సిటీ ఉద్యోగి చనిపోతే వారి స్వస్థలం కడప జిల్లా దూర ప్రాంతం అయినప్పటికీ కాలం చెల్లిన వాహనంలోనే మృతదేహాన్ని పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన నవ సమాజ్ నాయకులు చంద్రనాయక్, బాలు నాయక్, దిలీప్, వెంకటాద్రి, తదితరులు పాల్గొన్నారు.

వేద వర్సిటీలో ముగిసిన సిద్ధాంత కార్యశాల

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో వైఖానస పాంచరాత్ర శైవాగమములలో 21 రోజులగా జరిగిన అంతర్జాతీయ సిద్ధాంత కార్యశాల బుధవారంతో ముగిసింది.

టీడీపీతోనే నియోజకవర్గ అభివృద్ధి : ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు మండలంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం 9 సిమెంట్ రోడ్లు, ఒక గోకులం షెడ్, ఒక వేసవి పశువుల నీటి తొట్టిని ప్రజా ప్రయోజనాల కొరకు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తాసిల్దార్ రాజశేఖర్, స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీఓ గణేష్, సత్యవేడు పంచాయతీ కార్యదర్శి ముని రవికుమార్, టిడిపి క్లస్టర్ కోఆర్డినేటర్ పరమశివం భాష, శశి నాయుడు, శివానందం, ప్రభాకర్ రెడ్డి, సుందర్ రామిరెడ్డి, లోకనాథ్ రెడ్డి, జగన్నాథం, ముత్తయ్య, కోళ్ల చిన్న, రామకృష్ణ, ప్రవీణ్, ముద్దు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన శ్మశానానికి హద్దులు ఏర్పాటు

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని అల్లంపాడు పంచాయతీ పరిధిలో ఉన్న చీకళ్లదిబ్బలో ఇటీవల స్మశానం కోసం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్‌కు గ్రామస్తులు అర్జీ పెట్టుకున్నారు.ఈ నేపథ్యంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్ ఆదేశాల మేరకు బుధవారం కోట తాహాసిల్దార్ కటారి జయ జయ రావ అల్లంపాడు పంచాయతీ చీకళ్లదిబ్బలో 54.2 సర్వే నంబర్‌లో 1.2 సెంట్లు స్మశానం ఆక్రమణకు గురైనట్లు పరిశీలించారు. తాహాసిల్దార్, వీఆర్వో కృష్ణ, సర్వేయర్ గోపిరెడ్డిల సమక్షంలో ఆక్రమణకు గురైన 1.2 సెంట్లు భూమికి హద్దులు ఏర్పాటు చేసి మేకులు నాటారు. స్మశానానికి వెళ్లే బాటకు కూడా హద్దులు ఏర్పాటు చేశామని తాహాసిల్దార్ తెలిపారు.

గుంటూరు మిర్చి రైతులకు న్యాయం చేయాలి : ఎంపీ గురుమూర్తి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: గుంటూరు మిర్చి రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభం, ముఖ్యంగా దిగుబడులు తగ్గిపోవడం, సాగు వ్యయాలు పెరగడం, మార్కెట్ ధరలు భారీగా పడిపోవడం వంటి సమస్యలు రైతుల జీవనోపాధిపై తీవ్రమైన ప్రభావం చూపుతున్న నేపథ్యంలో వైసీపీ తిరుపతి ఎంపి గురుమూర్తి బుధవారం పార్లమెంటులో ప్రత్యేక ప్రస్తావన 377 ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం మిరప రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. మిర్చి సాగు భారంగా మారిందన్నారు. గతేడాది క్వింటాల్‌కు రూ.22 వేలు ఉన్న మిర్చి ధర ఇప్పుడు రూ.10 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి మద్దతు లేకపోవడంతో రైతులు ఎకరానికి రూ.50 నుంచి 60 వేల వరకు నష్టపోతున్నారన్నారు. గుంటూరు మిర్చి యార్డు, సత్తెనపల్లి రోడ్డులో పెద్ద సంఖ్యలో రైతులు ధర్నా చేస్తున్న విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు సరైన మద్దతు ధర దక్కకుండా ధరలు పతనమయ్యేలా దళారీలు రాష్ట్ర ప్రభుత్వంతో చేతులు కలిపినట్లు ఆరోపణలు ఉన్న విషయాన్ని సభలో ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం మార్కెట్ ఇన్టర్వెన్షన్ స్కీమ్ ద్వారా సహాయం అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఆ నిధులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల వల్ల రైతుల చేతికి చేరని విషయాన్ని ఎత్తి చూపారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి మిర్చి క్వింటాల్‌కు రూ.18 వేల చొప్పున కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు న్యాయం చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రిని కోరారు.

నేటి నుంచి టెన్త్ వాల్యుయేషన్

ప్రజాశక్తి - తిరుపతి: పదవ తరగతి పబ్లిక్ పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం నుంచి తిరుచానూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభం కానుంది. ఈ ప్రక్రియ ఈ నెల 9న పూర్తికానుంది. అనంతరం ఫలితాలను ఈ నెలలోనే విడుదల చేసే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖా అధికారి కె వి ఎన్ కుమార్ తెలిపారు.

మణి నాయుడుకు ఘన సన్మానం

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బి.యన్ కండ్రిగ వైసీపీ మండల అధ్యక్షుడు మణి నాయుడును శ్రీకాళహస్తి ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి బుధవారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా మిద్దెల హరి మాట్లాడుతూ బియన్ కండ్రిగ వైసీపీ మండల అధ్యక్షుడుగా మనినాయుడు నియామకం సంతోషంగా ఉందన్నారు.

దూర విద్య పరీక్షా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో దూరవిద్య విభాగం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వర్సిటీ ఇంచార్జీ ఉపకులపతి ఆచార్య సిహెచ్ అప్పారావు పుత్తూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీలు చేశారు.

మద్యం తాగి వాహనాలు నడుపరాదు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మద్యం సేవించి వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని బుచ్చినాయుడుకండ్రిగ సీఐ తిమ్మయ్య హెచ్చరించారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రి, చెక్పోస్టులో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక నిఘా పెడుతున్నట్టు తెలిపారు.

ధాన్యం సేకరణపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు, ఎండి పుత్తూరులో ధాన్యం సేకరణ గురించి రైతులకు సివిల్ సప్లై డిఎం సమక్షంలో అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా రైతులు ప్రభుత్వానికి ధాన్యం ఇచ్చేందుకు, తాము పండించిన పంట ధాన్యం యొక్క తేమ శాతం చూసుకుని, చెత్తాచెదారం లేకుండా రైతు సేవ కేంద్రంలోని వ్యవసాయ సహాయకులు వద్ద షెడ్యూలు తీసుకుని, పిఎసిఎస్‌లో రైస్ మిల్ అసైన్ చేయించుకుని ధాన్యాన్ని అప్పగించవలసిందిగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి షణ్ముగం, భారతి, ఎండి పుత్తూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలో జరిగిన అభివృద్ధి పనులపై నేడు ఉదయం 10 గంటలకు మునిసిపల్ కౌన్సిల్ హాల్‌లో పుత్తూరు మున్సిపాలిటీ, పుత్తూరు రూరల్ మండలం, వడమాలపేట మండలానికి సంబందించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరవుతారని మున్సిపల్ అధికారులు ఒక ప్రకటనలో తెలియజేశారు.

మున్సిపల్ కార్మికులు ఒక పూటే విధులు నిర్వహించేలా ఆదేశాలివ్వండి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డీపల్లి చెంగయ్య



ప్రజాశక్తి-వెంకటగిరి టౌన్ : వేసవి ఉష్ణోగ్రతలు, వడగాల్పులు ఏప్రిల్ నెల నుండి జూన్ నెల వరకు తీవ్రంగా ఉంటున్నందున మున్సిపల్ కార్మికులకు మూడు నెలల పాటు ఒక పూట మాత్రమే విధులు నిర్వహించే విధంగా కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు తిరుపతి జిల్లా అధ్యక్షులు వడ్డీపల్లి చెంగయ్య ఒక ప్రకటనలో కోరారు. ఆయన మాట్లాడుతూ కార్మికులతో ఉదయం 5:30 నుండి 11:30 గంటల వరకు మాత్రమే పనులు చేయించాలని అన్నారు. వారి ఆరోగ్య సంరక్షణకు ఏర్పాట్లు చేయాలని కోరారు.


తుమ్మూరు శ్మశాన వాటికకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలి



ప్రజాశక్తి - నాయుడుపేట: స్మశానవాటికకు వసతులు కల్పించాలని నాయుడుపేట మున్సిపాలిటీలోని తుమ్మూరు గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నాయుడుపేట మున్సిపాలిటీలోని తుమ్మూరులో దాత సన్నారెడ్డి రాజారెడ్డి సౌజన్యంతో సుమారు కోటి 30 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన స్మశాన వాటికకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని తుమ్మూరు గ్రామ ప్రజలు బుధవారం నాయుడుపేట మున్సిపాలిటీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. స్మశాన వాటిక నిర్మాణం పూర్తయి 8 నెలలు కావస్తుందన్నారు. అప్పటి నుండి అనేక పర్యాయాలు మున్సిపల్ అధికారులకు స్మశాన వాటికకు విద్యుత్ సౌకర్యం, తాగునీరు సరఫరా చేయాలని అనేక వినతి పత్రాలు సమర్పించామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే తుమ్మూరు స్మశాన వాటికకు తాగునీరు విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో సమస్యను జిల్లా కలెక్టర్‌కు వివరిస్తామని అన్నారు.

ఉబర్ సంస్థ ప్రతినిధులతో ఆర్టీవో భేటీ

15 రోజుల్లో ఉబర్ వాహన డ్రైవర్ల సమస్యల పరిష్కారం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత నెల రోజులకు పైగా ఉబర్ యాజమాన్యంతో ఎదుర్కొంటున్న సమస్యలని పరిష్కరించాలని కోరుతూ జిల్లా రవాణా శాఖ అధికారి మురళీమోహన్‌ను వాహన డ్రైవర్లు, ఊబర్ సంస్థలో నమోదు చేసుకున్న వాహన యజమానులు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఉబర్ సంస్థ ప్రతినిధులు, ఉబర్ వాహన డ్రైవర్లు, యజమానులతో సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. తిరుపతి నుండి వివిధ ప్రదేశాలకు ప్రయాణ చార్జీలను తగు రీతిలో మెరుగు పరచాలని, ఉబర్ సంస్థలో పేర్లు నమోదు చేయించుకున్న వారు కాకుండా బయటి వ్యక్తులు వాహనాలు నడపడాన్ని వ్యతిరేకిస్తూ దానిపై చర్యలు తీసుకోవాలని, తిరుపతి విమానాశ్రయంలో పార్కింగ్ సమస్యను పరిష్కరించాలని మోటార్ క్యాబ్ వాహనదారులు, డ్రైవర్లు ఈ సమావేశంలో ఆర్టీవో దృష్టికి తీసుకువచ్చారు. సమ్మె చేస్తున్న కారణంగా వాహన యజమానులు, డ్రైవర్లు రోడ్డున పడే ప్రమాదం ఉందని, సత్వరమే సమస్యలకు పరిష్కారం చూపాలని ఊబర్ సంస్థ ప్రతినిధులతో చర్చించారు. రానున్న 15 రోజుల్లో ఈ సమస్యలను పరిష్కరించగలమని జిల్లా రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్‌కు సంస్థ ప్రతినిధులు తెలియజేశారు. ఈ సంయుక్త సమావేశంలో ఎంవిఐలు సుబ్రమణ్యం, శ్రీనివాసరావు, మోహన్ కుమార్, డిటిఓ కార్యాలయ పరిపాలన అధికారిని విజయ ప్రశాంతి, సీనియర్ సహాయకులు చరణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.